క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక


వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌తో మైనారిటీ విభాగం నాయకుడు బాజీ

ఉంగుటూరు: నూరు బాషా ముస్లిం మైనార్టీ నాయకుడు షేక్ సయ్యద్‌బాజీ వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం తాడేపల్లిలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. వైఎస్సార్ సీపీ మైనారిటీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధిగా అవకాశం కల్పించినందుకు మర్యాదపూర్వకంగా కలిసి, కృతజ్ఞతలు తెలిపినట్లు బాజీ వివరించారు. పార్టీ అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తానని తెలిపారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ


బాబా గుడిలో ప్రతిష్ఠించిన కృష్ణుడి విగ్రహం

ఉంగుటూరు: మండలంలోని ఉప్పాకపాడు సాయి బాబా గుడి ప్రాంగణంలో బుధవారం ఉదయం దూలం వెంకటేశ్వరరావు, వరలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడు విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో శ్రీవల్లి, సత్యనారాయణ దంపతులు, ఉప్పు సత్యనారాయణ, మణిమాల దంపతులు, మాకా శ్రీను, లక్ష్మి దంపతులు తదితరులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణ పనుల పరిశీలన

భీమడోలు: గుండుగొలను వద్ద గోదావరి కాలువపై నూతనంగా నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులను బుధవారం ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పరిశీలించారు. సాంకేతిక కారణాల రీత్యా ఈ వంతెన నిర్మాణంలో జాప్యం జరుగుతుంది. దీంతో కొల్లేరు వాసులతో పాటు పలు మండలాలకు చెందిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై గుండుగొలనులో జరిగిన పల్లె పల్లెకు పత్సమట్ల కార్యక్రమంలో గ్రామస్తులు ఈ వంతెన నిర్మాణం పూర్తి చేయాలని ఎమ్మెల్యే ధర్మరాజుకు విన్నవించారు.

క్రీస్తు ప్రవచనాలను ప్రజలకు అందించాలి

పెదపాడు: దేవుడి సేవలకు ఏసుక్రీస్తు ప్రవచనాలను ప్రజలకు అందించి సన్మార్గంలో నడిపించాలని ఆర్‌సీఎం వికార్ జనరల్ రెవరాండ్ ఫాదర్ బాల ఏపీపీఎఫ్ నేషనల్ జనరల్ సెక్రటరీ రెవరాండ్ పి.జీవన్‌కుమార్ తెలిపారు. పెదపాడు కో-ఆపరేటివ్ సొసైటీ ప్రాంగణంలో పెదపాడు మండల పాస్టర్స్ ఫెలోషిప్ ప్రారంభ కార్యక్రమాన్ని నాయుడుగూడెం ప్యారిస్ గురువులు రెవరాండ్ గోట్రు సాల్మన్ రాజు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీపీఎఫ్ నేషనల్ జనరల్ సెక్రటరీ పి.జీవన్‌కుమార్, వికార్ జనరల్ ఫాదర్ బాల, బిషప్ సుభద్ర, ఏఎంసీ చైర్మన్ గారపాటి రామసీత, జాషువారాజు, బ్రదర్ బి.బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలను అరికడదాం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మాదకద్రవ్యాల దుర్వినియోగాన్ని అరికట్టడం అందరి బాధ్యతని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. నషాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఏలూరు సీఆర్ రెడ్డి కాలేజీ గ్రౌండ్స్‌లో జిల్లా యంత్రాంగం, ఎక్సైజ్, ఈగల్ టీం పోలీస్ సిబ్బంది సంయుక్తంగా నిర్వహించిన మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ కార్యక్రమంలో కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ కేపీఎస్ కిషోర్, ఎమ్మెల్యే బడేటి చంటి, విద్యార్థులు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. రాష్ట్రస్థాయిలో 1972, నషా ముక్త్ భారత్ అభియాన్ టోల్ ఫ్రీ నంబర్ 14446, నాటుసారా నిరోధానికి 14405 నెంబర్లలో సమాచారం అందించాలన్నారు. స్తే వెంటనే చర్యలు తీసుకుంటారని తెలిపారు.

జర్మనీలో నర్సింగ్ ఉద్యోగావకాశాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జీఎన్ఎం / బీఎస్సీ నర్సింగ్ చదువుకొని 35 సంవత్సరాల్లోపు ఉన్న షెడ్యూల్డు కులాల మహిళలకు జర్మనీలో నర్సింగ్ ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి సాంఘిక సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ సహకారంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ, ఉద్యోగ అవకాశం కల్పిస్తోందని జిల్లా ఎస్‌సీ సొసైటీ కార్యనిర్వాహక సంచాలకులు ఎం ముక్కంటి తెలిపారు. 8 నుంచి 10 నెలల వరకు శిక్షణ ఉంటుందని, శిక్షణ సమయంలో ఉచిత వసతి, భోజన సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. శిక్షణానంతరం జర్మనీ దేశంలో నర్సింగ్ ఉద్యోగం కల్పించి నెలకు రూ.2,40,000 (యూరో 2700) నుంచి రూ.3,10,000 (యూరో 3500)ల వరకు జీతం పొందడానికి అవకాశం ఉందని వివరించారు. జీఎన్ఎంలో మూడేళ్లు అనుభవం, బీఎస్సీ నర్సింగ్‌లో రెండేళ్లు అనుభవం ఉండాలని తెలిపారు. ఈ నెల 15 నుంచి గుంటూరులో శిక్షణ ప్రారంభమౌతుందని, వివరాలకు ఫోన్ నంబర్లు 93468 90335, కె.రాంచందు 96665 45975, 99888 53335లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

అమాంతం పెరిగిన ఉల్లి ధరలు


మార్కెట్‌లో విక్రయానికి సిద్ధంగా ఉన్న ఉల్లిపాయలు

- గగ్గోలు పెడుతున్న వినియోగదారులు
- ఇంకా పెరిగే అవకాశం ఉందంటున్న వ్యాపారులు

పెదవేగి: ఉల్లి ధరలు ఆకాశన్నంటుతున్నాయి. మొన్నటివరకూ అందుబాటులో ఉన్న ఉల్లిపాయల ధరలు ఒక్కసారిగా పెరగడంతో వినియోగదారులు విలవిలాడుతున్నారు. ఉల్లిపాయలు కొనుగోలు చేయాలంటేనే ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. మార్కెట్‌లో కిలో రూ.20 ఉన్న ధర ప్రస్తుతం 35 పలుకుతోంది. ధరలు మరింత పెరగొచ్చని వ్యాపారులు అంటున్నారు. కర్నూల్, పూనా నుంచి ఉల్లి రవాణా లేకపోవడం, వర్షాల కారణంగా పంటలు దెబ్బతినడం వలన గిరాకీ ఏర్పడిందని వ్యాపారులు చెబుతున్నారు. వర్షాలు ఇలాగే ఉంటే ఉల్లికి డిమాండ్ ఏర్పడుతుందని ఆందోళన చెందుతున్నారు. వారం రోజుల్లో కిలోకు రూ.35 వరకూ పెరిగిపోయింది. రైతుల వద్ద ధరలు తక్కువగా ఉన్నప్పటికీ వ్యాపారులవద్ద ధరలు మండిపోతున్నాయని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ప్రధానంగా పెళ్లిళ్ల సీజన్ కావడంవలన ఉల్లి వినియోగం ఎక్కువగా ఉంటుంది. ప్రతి సంవత్సరం జూలై, ఆగస్టు నెలల్లో ఉల్లిపాయల ధరలకు రెక్కలు వస్తున్నాయి. జూలై నాటికి దేశంలోని మార్కెట్లలో ఉల్లి సరఫరా నిలిచిపోతుంది. ప్రధానంగా కర్నూల్, పూనాలో ఉల్లి సాగు తగ్గడం, వర్షాభావంవలన ఉల్లి ధర పెరగడానికి కారణమని వ్యాపారులు అభిప్రాయపడుతున్నారు.

ఆచితూచి కొంటున్నాం



ఉల్లి ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. దీంతోపాటు ఇతర కూరగాయల ధరలు కూడా ఆకాశాన్నంటుతున్నాయి. ఉల్లి ధర రెట్టింపు అవడంతో ఆచితూచి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. రోజు రోజుకూ పెరుగుతున్న ధరలతో ఏం కొనలేం .. తినలేమన్న పరిస్థితి ఏర్పడింది.

– ఉంద్రాజవరపు నాగమణి, గృహిణి

ఉపాధి పనులు పారదర్శకంగా చేయించాలి


సామాజిక తనిఖీ సమావేశంలో పాల్గొన్న జిల్లా అధికారులు

ఉంగుటూరు: ఉపాధి హమీ పనలు మరింత పారదర్శకంగా నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని డ్వామా పీడీ సుబ్బారావు అన్నారు. ఎంపీడీవో రాజ్‌మనోజు అధ్యక్షతన ఉపాధి హమీ పనుల సామాజికత తనిఖీ పూర్తయిన నేపథ్యంలో గుర్తించిన తేడాలను వివరించేందుకు సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సుబ్బారావు మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు గ్రామీణ ప్రాంత ప్రజలు ఉపాధి పొందేందుకు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. 17వ సామాజిక తనిఖీలో మొత్తం 1302 పనులు జరిగాయని ఎంపీడీవో రాజ్‌మనోజు వెల్లడించారు. 19.92 కోట్ల రూపాయలు ఖర్చు అయినట్లు వివరించారు. సమావేశంలో ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, ఏపీడీ పురుషోత్తం, ఏపీడీ వర్లాళ్లకంటి విక్టర్, జిల్లా విజిలెన్స్ ఆఫీసరు నేతి బుజ్జి, ఫీల్డ్ సహాయకులు పాల్గొన్నారు.

చేతుల శుభ్రతపై అవగాహన కల్పించాలి


చిన్నారులకు చేతుల శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

దెందులూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు చేతుల శుభ్రతపై అవగాహన కల్పించాలని పోతునూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం పోతునూరు పీహెచ్‌సీ పరిధిలో ఉన్న గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో హ్యాండ్ వాష్‌పై అవగాహన కల్పించారు. అనేక రోగాలకు ప్రధాన కారణం చేతులు పరిశుభ్రంగా లేకపోవడమేనన్నారు. చేతులు పరిశుభ్రత సురక్షితమైన త్రాగునీరు రెండింటి విషయాలు చిన్నారులకు నిరంతరం అవగాహన కల్పించాలని అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. ఎంపీహెచ్ఓ ప్రభాకర్, సూపర్‌వైజర్ హరి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ విల్సన్

భీమడోలు: జాతీయ రహదారుల వెంబడి వ్యాపారాలు నిర్వహిస్తున్న రెస్టారెంట్లు, హోటళ్లు, దాబా యాజమానులు నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని భీమడోలు సర్కిల్ సీఐ యూజే విల్సన్ అన్నారు. భీమడోలు సర్కిల్ కార్యాలయంలో బుధవారం భీమడోలు, ద్వారకాతిరుమల పోలీస్‌స్టేషన్ల పరిధిలో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నందున హోటళ్ల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎస్సై వై.సుధాకర్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీఐ యూజే విల్సన్ మాట్లాడారు. హోటళ్ల వ్యాపారాలు అనుసరించాల్సిన విధి విధానాలపై ఆయన దిశానిర్దేశం చేశారు. జాతీయ రహదారుల వెంబడి రోజు రోజుకూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. వాటిని నియంత్రించేందుకు హోటళ్ల నిర్వాహకులు పోలీసులు సహకరించాలని కోరారు. రోడ్డుకు ఆనుకుని ఉన్న హోటళ్ల యాజమానులు ఎట్టి పరిస్థితుల్లో రాత్రి 10.30 గంటలకు వాటిని మూసి వేయాలని కోరారు. హైవేపై ఉన్న వ్యాపారులు తమ దుకాణంతో పాటు రోడ్డు కనిపించేలా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో పోలీసులు, వ్యాపారులు పాల్గొన్నారు.

సైఫన్ మీదుగా రాకపోకలు నిలుపుదల


సైఫన్ వద్ద పరిస్థితిని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎస్సై

దెందులూరు: దెందులూరు, అలుగులగూడెం మధ్య నిర్మించిన సైఫన్ మీదుగా భారీ వర్షాల కారణంగా రాకపోకలు నిలిపివేసినట్లు తహసీల్దార్ బి.సుమతి, ఎస్సై ఆర్.శివాజీ అన్నారు. బుధవారం రాత్రి సైఫన్ వద్ద పరిస్థితిని పరిశీలించారు. ఈ సైఫన్ మీదుగా దాదాపు 7, 8 గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తారు. వరుసగా నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు ఉన్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నామని అధికారులు వివరించారు. స్టాఫ్ బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. రెవెన్యూ, పోలీసు శాఖల గ్రామ స్థాయి ఉద్యోగులను సైఫన్ వద్ద డ్యూటీలు వేశామని తహసీల్దార్ వివరించారు.

ఫలిస్తోన్న 'ఆపరేషన్ ట్రేస్'


ఎస్పీ కేపీ శివకిషోర్, అధికారులు

ఏలూరు టౌన్: సమాజంలో నిరాధారణకు గురవుతూ, అనాథలుగా ఇతర చోట్ల ఆశ్రయం పొందుతూ, ఆయా కేసుల్లో హోమ్స్‌లో ఉంటూ తీవ్ర మానసిక వేదనకు గురవుతున్న పిల్లలను వారి తల్లిదండ్రులు, కుటుంబాల చెంతకు చేర్చే ఆపరేషన్ ట్రేస్ కార్యక్రమం సత్ఫలితాలు ఇస్తోందని ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ అన్నారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆయన బుధవారం విలేకర్లతో మాట్లాడారు. అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ పర్యవేక్షణలో మహిళా స్టేషన్ సీఐ ఎం సుబ్బారావు, శక్తి టీమ్ అధికారులు శనివారపుపేట ప్రభుత్వ బాలుర వసతిగృహంలో పిల్లలతో మమేకమయ్యారని తెలిపారు. 12 మంది బాలల కుటుంబాల అడ్రస్‌లు గుర్తించారని చెప్పారు. రెండున్నరేళ్ల నుంచి తల్లిదండ్రుల సమాచారం తెలియని నలుగురు బాలికలను కుటుంబాలకు అప్పగించామన్నారు. బాలుడి తల్లిదండ్రులను అమలాపురంలో గుర్తించగా, మరో బాలుడి తండ్రి మరణించగా, తల్లి వేరొక వ్యక్తిని వివాహం చేసుకోవటంతో చెన్నై ప్రాంతంలో పెంపకానికి పంపిందనని, బాలుడు అక్కడి నుంచి పారిపోయి చెన్నై చైల్డ్‌లైన్‌లో ఉంటున్నాడని తెలిపారు. బాలుడు భీమవరం పరిసర ప్రాంతానికి చెందిన వాడిగా గుర్తించామన్నారు. తల్లి లేకపోవటంతో అక్క, అన్న, పిన్నికి అప్పగించారు. ఏలూరు రూరల్ స్టేషన్ పరిధిలో ఆచూకీ తెలియని ఒక తల్లి, ఇద్దరు పిల్లలు, తడికలపూడి స్టేషన్ పరిధిలో రెండేళ్ల నుంచి ఆచూకీ తెలియని ఒక తల్లి, ఇద్దరు పిల్లలను వారి బంధువులకు అప్పగించామని వివరించారు. ఆపరేషన్ ట్రేస్‌లో ప్రతిభ చూపిన ఏలూరు మహిళా స్టేషన్ సీఐ సుబ్బారావు, శక్తిటీమ్‌ను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

భారీ వర్షంతో ప్రజల అవస్థలు

పల్లపు ప్రాంతాలు జలమయం


వర్షంలో తడుచుకుంటూ వెళుతున్న విద్యార్థులు

భీమడోలు: అల్పపీడన ప్రభావంతో బుధవారం సాయంత్రం నుంచి కురుస్తున్న కుండపోత వర్షానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు నీటితో నిండిపోయాయి. మండలంలోని భీమడోలు, గుండుగొలను, పూళ్ల, పోలసానిపల్లి, కోడూరుపాడు, కొల్లేరు గ్రామాల్లో ఏకధాటిగా కురుస్తున్న వర్షానికి పలు కాలనీల్లో వర్షపు నీరు చేరింది. ప్రధాన రహదారులపై ఏర్పడిన గుంతల్లో వర్షపు నీరు చేరడంతో వాహనదారులు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రహదారులకు ఇరువైపులా డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షపు నీరు ప్రవహించే అవకాశం లేక రోడ్డుపై నిలిచిపోయాయి. భీమడోలు జంక్షన్ నుంచి సంత మార్కెట్ వరకు, భీమడోలు రాజుల వీధి రోడ్డు, గుండుగొలను, డైలీ మార్కెట్ రోడ్డు, ఎస్సీ, బీసీ కాలనీల్లో మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తుంది. భీమడోలు వారపు సంతకు వర్షం తీవ్ర అటంకంగా మారింది. మరో మూడు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగం, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. కొన్ని రోజులుగా ముఖం చాటేసిన వరుణుడు ఒక్కసారిగా కురవడంతో రైతులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఎండిపోతున్న వరి చేలను వర్షం కాపాడుతుందని రైతులు అంటున్నారు.

కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వాలి

ఏలూరు (టూటౌన్): కౌలు గుర్తింపు ఉన్న రైతులకు పంట రుణాలు బ్యాంకులో ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ నీలాద్రిను ఏపీ కౌలు రైతు సంఘం, ప్రజాసంఘాల నాయకులు ఏలూరులో బుధవారం కోరారు. ఏపీ కౌలు రైతు సంఘం (ఏబికేఎస్) రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా ఆయనకు వినతిపత్రం అందజేశారు. మండల స్థాయిలో సంయుక్త సమావేశాలు నిర్వహించాలని కోరారు. కౌలు గుర్తింపు కార్డులు ఉండి, వ్యవసాయం చేస్తున్న కౌలు రైతులకు బ్యాంకుల నుంచి వ్యవసాయ ఇతర రుణాలు మంజూరు చేయాలన్నారు. భూ యజమానులకు రుణాలు ఇచ్చి, కౌలు రైతులకు రుణాలు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడం సరి కాదని పేర్కొన్నారు. కౌలు రైతులకు పంట రుణాలు బ్యాంకుల ద్వారా ఇచ్చేందుకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని, ఏ బ్యాంకులైనా రైతులకు రుణాలు ఇచ్చే సమయంలో ఇబ్బందులు పెడితే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని లీడ్ బ్యాంక్ మేనేజర్ నీలాద్రి తెలిపారని నాయకులు చెప్పారు. నీలాద్రిని కలిసిన వారిలో కౌలు రైతు సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి దొంతా కృష్ణ, ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు టిక్కలపాటి. ప్రసాద రావు, బీకేఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

అనవసర పెట్టుబడితో నష్టపోవద్దు


కేశవరంలో ఈ-పంట నమోదు పరిశీలిస్తున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

గణపవరం: రైతులు అవసరం లేకుండా ఎరువులు, పురుగుమందులు వాడటం ద్వారా అనవసర పెట్టుబడితో నష్టపోతున్నారని, వ్యవసాయ నిపుణుల సూచనలు పాటించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన గణపవరం మండలం కేశవరంలో వ్యవసాయ శాఖ నిర్వహిస్తున్న ఈపంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా రైతులను కలిసి ఏ రకాల పంటలను వేసిందీ అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా ప్రజలు వినియోగించే రకాలను సాగు చేయాలని సూచించారు. పెట్టుబడి ఎలా పెడుతున్నారు, ఎరువుల లభ్యత ఎలా ఉంది అని రైతుల నుంచి ఆరా తీశారు. వ్యవసాయ సిబ్బంది తాము ఎదుర్కొంటున్న సమస్యలను జేసీకి వివరించారు. సర్వే నంబరులో ఉన్న పొలానికి 20 మీటర్ల దగ్గరకు వెళ్తే కాని ఈపంట నమోదు కావడం లేదని తెలిపారు. కార్యక్రమంలో ఏవో ఆర్ఎస్ ప్రసాద్, రైతులు యాళ్ల పెద్దిరాజు, దండు గజపతిరాజు, దండు రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి

ఏలూరు (టూటౌన్): ఉపాధి హామీ పథకం కూలీలకు 10 వారాలకు పైగా బకాయి పడ్డ వేతనాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ రైతు కూలీ సంఘం (ఆం.ప్ర) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించారు. ఉపాధి హామీ కూలీల వేతనాలు చెల్లించాలని పెద్ద ఎత్తున నినాదాలతో హోరెత్తించారు. రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు మిడియం రవి దొర అధ్యక్షత వహించగా రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి షేక్ బాషా, ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా నాయకులు సవలం రాంబాబు మాట్లాడుతూ పోలవరం మండలంలోని ఆదివాసీ ప్రజలు ఉపాధి కూలీ డబ్బులు రాక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

దేశభక్తితో హర్ ఘర్ తిరంగా ర్యాలీ


గణపవరం: జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహిస్తున్న స్వచ్ఛంద సంస్థల సభ్యులు, విద్యార్థులు

గణపవరం: హర్‌ఘర్ తిరంగా ప్రచారంలో ప్రజలు భాగస్వాములు కావాలని, దేశభక్తితో బాధ్యతగా ప్రవర్తించాలని గణపవరం ఎంపీడీవో బీబీ శ్రీలక్ష్మి, ఎంఈవో గొర్రెల బాలయ్య అన్నారు. బుధవారం గణపవరంలో హర్‌ఘర్ తిరంగా ప్రచారం నిర్వహించారు. డిగ్రీ జూనియర్ కాలేజీ విద్యార్థులతో కలిసి జాతీయ పతాకాలతో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం పోలీస్ ఐలెండ్ కూడలిలో మానవహారం నిర్మించారు. గణపవరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో హర్‌ఘర్ తిరంగా ప్రచారంలో భాగంగా గణపవరం నంబర్-1 బాలురు, బాలికల ఉన్నత పాఠశాలల విదార్థులు జాతీయ పతాకాలతో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు వెల్లంకి నరేష్, కిలారి రవిబాబు, కె.సత్యనారాయణ, కాకర్ల వినయ్, వర్తక సంఘం అధ్యక్షుడు ఆర్‌వీఎస్ రాజు, హెచ్ఎంలు తోట అప్పారావు, వీరవేణి, ఎంఎల్ఎస్ఎస్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉంగుటూరులో..

ఉంగుటూరు: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఉంగుటూరు మండలం చేబ్రోలు గ్రామంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. చేబ్రోలు కార్మెల్ కాన్వెంట్ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉంగుటూరు నియోజకవర్గ కన్వీనర్ మాలతీ రాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి నగరపాటి సత్యనారాయణ, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు అడపా శోభారాణి, వంజరపు దుర్గారావు, చేబ్రోలు సర్పంచ్ లక్ష్మీసునీత, విద్యార్థులు పాల్గొన్నారు.

భీమడోలులో..

భీమడోలు: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని బుధవారం బీజేపీ శ్రేణులు హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, నాయకులు దేశ సమైక్యతను చాటుతూ జాతీయ జెండాలను చేతబట్టుకొని పురవీధుల్లో ర్యాలీ చేశారు. తొలుత భీమడోలు మాధురి జూనియర్, డిగ్రీ కళాశాల వద్ద నుంచి ర్యాలీ ప్రారంభించి, పుర వీధుల గుండా భీమడోలు జంక్షన్‌కు చేరుకుంది. అక్కడ మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. కార్యక్రమంలో అప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, సీఐ యూజే విల్సన్, ఎస్సై వై.సుధాకర్, బి.మూర్తి, వెజ్జు ధర్మారావు, ప్రవీణ్ కుమార్ పటేల్, మత్తే శ్రీనివాసశాస్త్రి, పాకిన సత్యనారాయణ, బాదర్వాడ అనిల్ కుమార్‌రాజు, పైడిమాల యుగంధర్, కుక్కల ప్రసాద్, ఎం.కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.


భీమడోలు: ర్యాలీ చేస్తున్న ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు


ఉంగుటూరు: చేబ్రోలులో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

మోదీ, ట్రంప్ దిష్టి బొమ్మల దహనం

ఏలూరు (టూటౌన్): కేంద్రలో మోదీ ప్రభుత్వం చేసుకుంటున్న విదేశీ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో దేశ వ్యవసాయ రంగానికి తీవ్ర నష్టమని రైతు, కార్మిక, రైతు కూలీ, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల సమన్వయ కమిటీ పిలుపుమేరకు క్విట్ కార్పొరేట్ల నిరసన కార్యక్రమాన్ని ఏలూరులో పాత బస్టాండ్ సెంటర్ అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్, బి కే యం యు రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వర రావు, ఐఎఫ్‌టీయూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి బద్దా వెంకట్రావు, రైతు కూలి సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ బాషా మాట్లాడారు. ట్రంప్ సుంకాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మోదీ, ట్రంప్ దిష్టిబొమ్మలను దహనం చేశారు.